## అది ఇంటర్ సెకండియర్ క్లాస్ రూమ్

### ఆ క్లాస్ రూమ్‌లో బోర్డ్ పైన ఇలా వుంది:

### "చీరా! ఐ లవ్ యు–" ఇట్లు రవికె

# చీర–రవికె




అది చదివిన స్టూడెంట్స్ అందరూ నవ్వుకున్నారు. అంతటితో లెక్చరర్ క్లాస్‌లోకి రాగానే ఆ విషయం మరచిపోయారు. కానీ ఆ క్లాస్‌లో 'ఆ అమ్మాయి' మాత్రం మరచిపోలేకపోయింది. ఎందుకంటే ఆ అమ్మాయి కూర్చునే డెస్క్ డ్రాయర్‌లో, ఇంచుమించు వారం రోజుల నుంచీ, రోజూ అలాంటి లెటర్ కనిపిస్తోంది. అదే సంబోధన "చీరె! ఐ లవ్ యూ" –ఇట్లు రవికె అని వుంటోంది. మొదట్లో 'ఏమోలే అనుకుంది. వారం రోజులూ వరుసగా అదే విధంగా లెటర్ వుండడంతో ఆషామాషీగా తీసుకోలేకపోయింది. మరి ఈ రోజు 'ఏకంగా బోర్డ్‌పైనే రాసి వుంది. కానీ ఆ సంబోధనతో తన డెస్క్‌లోనే ఎందుకు పెడుతున్నారో, ఎవరు రాస్తున్నారో ఆమెకు అర్థం కాలేదు. 'మొత్తానికి తన క్లాస్లోనే ఎవరో రాస్తున్నారన్నది నిజం' అని అనుకుంది. ఆ రోజునుండీ డెస్క్ లెటర్స్ కొంచెం శృతి మించాయి.

"చీర 'ఏ చీరలో అయినా బాగుంటుంది. చీర కట్టుకు రాకూడదూ ప్లీజ్"

"చీరతోపాటే రవికె కదా! అందుకే నీతో పాటే నేను– రవికెను."

"హలో చీరా, 'ఏంటమ్మా!? ఈ రవికె నింకా గుర్తు పట్టలేదా?"

–ఇలా రోజుకో లెటర్ తప్పనిసరిగా వుంటోంది.

కొన్ని రోజుల తర్వాత–

ఆ అమ్మాయి తన ఇంట్లో కూర్చుని 'ఆంధ్రజ్యోతి' పత్రిక తిరగేస్తూ వుంది. అది ఎప్పటిదో పాత సంచిక. అందులో 'నిక్ నేమ్స్' శీర్షికన "జి. గురుమూర్తిని మేము జిగురుమూర్తి అని పిలుస్తాము" అని ఎవరో రాసిన విషయం చదవగానే ఆ అమ్మాయి మెదడులో 'ఏదో మెరిసింది. వెంటనే పేపర్ తీసుకుని తన పేరు రాసింది. C.HEERA- మధ్యలో 'C' పక్కనున్న ఫుల్‌స్టాప్ తీసేస్తే 'CHEERA' –చీర' అనే కదా పలికేది.

"మరి ఈ 'రవికె' ఎవరబ్బా? అని ఆలోచించసాగింది. తన క్లాస్‌లో అబ్బాయిల పేర్లు ఒక్కొక్కటే గుర్తు తెచ్చుకోసాగింది. ఎక్కువ సేపు ఆలోచించకుండానే, రవి.కె. –రవికె, అని తెలిసిపోయింది.

మరునటి రోజు డెస్క్ డ్రాయర్ తెరవగానే లెటర్ చూసింది. సి.హీరా. వెంటనే తలెత్తి రవి కూర్చునే చోటు చూసింది. రవి కూడా తనవైపే చూస్తూ వుండడంతో హీరా పెదవులు చిరునవ్వుతో నెమ్మదిగా విచ్చుకున్నాయి.

— బి.నరహరి